ఫష్టు తారీకునాటికి మళ్ళీ మీ భాగంలో ప్రవేశిస్తే నాకేమీ అభ్యంతరంలేదు. మీ ఉషా సుందరి ఉద్దేశ్యంకూడా అదే. ఆపిల్లకు నిజంగా తాతగారు మీరేగాని నేనుకాదు. ఆ విషయం దాని జబ్బులో రుజువైంది" అన్నాడు. వెంకట్రావు ఉష పక్కలో కూర్చొని, "ఉషా! మీ తాతగారు నన్ను మళ్ళీ మీ యింట్లో చేరమంటున్నాడు. నీవేమంటావు?" అని ప్రశ్నించాడు.

ఉష, "రా తాతయ్యా!" అంది. ఆమాటలు విని వరలక్ష్మమ్మ, కమల నవ్వి ఆనందబాష్పాలు విడిచారు.

"నా జీవితమంతా స్వప్నతుల్యమైంది. నాకు ఉషా సుందరిని చూచిన క్షణంనుంచీ ధైర్యం ఉత్సాహం కలిగాయి. నేను నా జీవితమామె ఉన్నతికోసం ధారపోయ నిశ్చయించుకున్నాను. నేనిక్కడనుంచి వెళ్ళిపోయానన్న మాటేగాని ప్రతిక్షణం ఆమె ముద్దు పలుకులు ఆమె నవ్వుపువ్వులు, ఆమె చిన్నారిచూపులూ, చేష్టలు జ్ఞప్తికి వచ్చి, ఆమెకూ, నాకూ జన్మాంతర సంబంధమేదో వుందని ఆందోళనతో కుందుతూనే ఉన్నాను" అన్నాడు వెంకట్రావు.

వాసుదేవరావు, పద్మనాభం, తదితర అకారణ శత్రువు లాశ్చర్యమందే విధంగా మళ్లీ వెంకట్రావు తన స్వంతంగా అయిదేళ్ళనుంచీ వుంటున్న భాగంలో ప్రవేశించడమే గాక, ఉషా సుంవరిని /వెంటబెట్టుకుని బహిరంగంగా కాఫీ హోటలుకు వస్తూన్నాడు. అతనిలో పిరికితనము పటాపంచలైంది. అతనిలో నిష్కల్మషతను రుజువుచేసుకొనడానికి అతను సంఘం ముందు ధైర్యంతో నిలబడినాడు. పాత స్నేహితులెవరైనా ఎదురై "ఎవరీ అమ్మాయి?" అని ప్రశ్నిస్తే, "నా పెంపుడు కూతురు.ఉషాసుందరి ఈమె పేరు. ఈమె భరత నాట్యం నేర్చుకుంటుంది. బి. యే. దాకా చదువుకుంటుంది. నా ఆస్తికంతకూ హక్కుదారురాలు నా ఉషా సుందరే." అని సమాధానం చెబుతాడు.

స్కెచ్

# కుర్రవాడి ఏడుపు కారణం

బులుసు-జీ-ప్రకాశ్

బజార్లో కెవ్వు కెవ్వుమని కుర్రాడొకడే ఏడుపు. ఎవరి తాలూకువాడో ఎవరికీ తెలియదు. వెక్కి వెక్కి రోదిస్తున్నాడు.

"నీకేం కావాలి బాబూ!" అని బుజ్జగించి అడిగాడొకాయన.

"చెప్పు నాయనా, ఏడుస్తావెందుకు?"

"మీ నాన్న కావాలి కదూ?"

"మీ నాన్నెవరు?

"మీ ఇల్లెక్కడుంది?" ఒక్కొక్కడే అడిగేస్తున్నారు, వాడికొక్కవల్సింది మాచెడ్డ ఇచ్చిపడిపోయేటట్లు. కాని కుర్రాడు మాట్లాడకుండా వున్నాడు. ఉలకడు. పలకడు. కొందరు పిప్పర్‌మెంట్ బిళ్ళలు, కొందరు చాక్‌లెట్లు, మరికొందరు స్ప్రింగు బిళ్ళలు ఎవరికి తోచింది వాళ్ళు తీసుకొచ్చి యిస్తున్నారు. అవన్నీ పుచ్చుకోలేదు పాపం ఆ నిసుగు. అయినా చుట్టూ వున్నవాళ్ళు బలవంతాన కూరేశారు జేబులో.ఒకాయన కుర్రాణ్ణెత్తుకుని—"అయ్యలారా! ఈ కుర్రాడు మాట్లాడకుండా వున్నాడు. ఇతని తండ్రి గానీ, మరే యితర బంధువులుగానీ ఇక్కడున్నట్లయితే తీసుకోమని ప్రార్థన" అని తన త్రాణకొద్దీ అరిచాడు. లాభం లేకపోయింది.

ఒకాయన నిమ్మతొన తీసుకొనమని నిర్బంధిస్తే తిన్నాడుకాడు. అంచేత ఆ మహాశయుడు గొప్ప టక్కువేశాడు. కుర్రాడు ఏడుద్దామని నోరెత్తేసరికల్లా నోట్లో పడేశాడా తొన. కుర్రాడు ఏడుపు ఒక్క నిమిషం ఆపి 'థూ' అని ఉమ్మగా, అది ఒకాయన వెళిపోదామని వెను దిరిగేసరికి, అతని చొక్కాపైపడి అంటు

కుంది. అంతా నవ్వులు మొదలు. ఆ వ్యక్తి అసలు కీలకం గ్రహించక మొదట రుసరుస లాడి, మళ్ళీ అందరితో పాటు తానూ ఒక్క నవ్వునవ్వి చల్లగా చకచకా నడుచుకుపోయాడు.

"ఎవరండీ ఆ కుర్రాడు?"

"ఏమీ చెప్పకుండా వున్నాడు"

"మాట్లాడ్డం వొచ్చా?"

"మహారాజు కొడుకులాగ! ఒణుకు లేకుండా పణుకులా మాట్లాడుతాడు"

"వాళ్ళ నాన్నెవరో మీకు తెలుసా?"

"తెలిస్తే భోగట్టా చెయ్యక మానేస్తామా?" అన్నాడు నా ప్రక్కాయన, నేనడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్తూ.

నలుగురితో పాటు నారాయణా అన్నట్లు నేనుకూడా అబ్బాయి నడిగాను "మీ నాన్నెవరు బాబూ?" అని.

"క్రిష్ణశాస్త్రి."

నేనడిగితే ఠపీమని జవాబివ్వగా నేచూస్తున్న వాళ్ళాశ్చర్యపోయారు. సిగ్గుపడ్డారు. నేను వెళ్ళిపోదామనుకునేసరికి ఒకాయన నన్నాపి— "బాబూ! నువ్వతన్ని మాట్లాడించు నాయనా! నువ్వివాళ ఆవుపేడ మట్టి వచ్చినట్లున్నావ్. నువ్వడగ్గానే చెప్పాడు" అని బ్రతిమాలాడు.

నేను వెంటనే కుర్రాణ్ణి సమీపించాను. అబ్బాయి కయిదేళ్ళుంటాయి. నుదురు వెడల్పాటిది. కళ్ళు పెద్దవి. చిన్న ఎత్తు క్రాఫింగు. నిక్కరు, అందులో చొక్కా. కాలికి బుల్లి బూట్లు. మొత్తంపై సామంతుల కుర్రాడిలా అవుపిస్తున్నాడు.

"నువ్వేం చదువుతున్నావ్ బాబూ?" అన్నాను.

"రెండు."

"భేష్! ఇక ఫర్వాలేదు!" అనుకున్నా.

"నువ్విక్కడ కెందుకొచ్చావ్?"

చెప్పాడుకాడు.

"మీ నాన్నగారి పేరు క్రిష్ణశాస్త్రి కదూ అన్నావ్? ఆయనేరీ?"

"ఇల్లాగే నాతో వొచ్చి నన్నిక్కడొదిలి ఎక్కడికో పోయారు."

కొంతసేపు యోచించాను. ఏ ఆలోచనా పాలుపోలేదు.

"ఇంతకీ మీ యిల్లెక్కడమ్మా?"

జేబులోదే ఒక చాక్లెట్ తీసి నోట్లో పెట్టుకుంటూ.

"అల్లా వీథిలో!" అన్నాడు చాక్లెట్ చప్పరిస్తూ ప్రవేలెట్టి చూపుతూ.

అబ్బాయి నా వీథిలోకి తీసికువెళ్లాను. నా వెనకాలే కొంతమందొచ్చారు. ప్రతి యింటికీ వెళ్ళి అడిగాను. ఎవరూ మాకు తెలీదంటే తెలీదన్నారు.

"మీ యిల్లిక్కడ కాదంటున్నారే! ఇక్కడేనా?"

"కాదు. ఆ పక్క" అని ఆ ప్రక్కవీథి చూబెట్టాడు. మళ్ళీ ఆ వీథికెళ్ళి ప్రతి యింట్లో అడిగాను. ఎవ్వరూ ఎరగమన్నారు.

ఇల్లా ఆ కుర్రాడు నాలుగైదు వీథులు తిప్పాడు. చివరికి పోలీసుస్టేషన్‌కి తీసికెళ్ళి కథా సంగ్రంచెప్పి వప్పజెప్పాను. పోలీసుల్ని చూడగానే కుర్రాడు రైలింజన్‌లా ఏడుపు మొదలెట్టాడు. "భయంలేదు బాబూ!" అని బుజ్జగించాను. ఇంకా ఆ ఏడుపు జోరు, హోరు తగ్గలేదు.

"ఏంకావాలి నాయనా? చెప్పమ్మా!" అన్నాను.

"మా అమ్మ కావాలి" అక్షరాలు ఒత్తి పలికాడు.

"మీ అమ్మ కావాలా? మీ అమ్మెక్కడుంది? చెప్పు తీసుకొస్తాను."

"చచ్చిపోయింది."


